సాక్షి
కుమురం భీం

ఆదివారం । 25 । జూన్ । 2023



ఆషాఢమొచ్చె.. ఆనందాలు తెచ్చె..
ఆషాఢమాసం ప్రారంభమైంది. ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఈ మాసం సొంతం. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండుగలు ప్రారంభమవుతాయి. 8లో▸



పోడు పట్టాలకు గ్రీన్ సిగ్నల్
పోడు సమస్యకు పరిష్కారం లభించనుంది. ఈనెల 30న ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ అర్హులైన గిరిజనులకు హక్కు పత్రాలు అందించనున్నారు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0/25.0
ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు సీఆర్టీ అర్హత పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఆదివారం ఉదయం 10నుంచి 12గంటల వరకు సీఆర్టీ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు డీటీడీవో మణెమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్ నంబర్ 1నుంచి 600వరకు గిరిజన బాలుర పాఠశాలలో (పీటీజీ), 601 నుంచి 929వరకు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో, 930నుంచి 1,198 వరకు గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు 30 నిమిషాలు ముందే కేంద్రాలకు రావాలని సూచించారు.

26న 'ఆదర్శ'లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో వివిధ గ్రూప్‌లలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 26న స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 25 సీట్లు, సెకండియర్ ఎంఈసీలో సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 11గంటలకు పదో తరగతి మెమో, బోనఫైడ్‌తో రావాలని సూచించారు.

పచ్చదనాన్ని పెంచాలి



సరండిలో మొక్కలు చూస్తున్న అడిషనల్ కలెక్టర్

వాంకిడి: పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న హరితహారం పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 10రోజుల్లో హరితహారం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సైజు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీవో శ్రవణ్‌కుమార్, ఏపీఎం మహేశ్, టీఏ సంతోష్ తదితరులున్నారు

పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: డీఈడీ ఫీజు చెల్లింపునకు జూలై 10తేదీ వరకు గడువు ఉన్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

26న యథావిధిగా ప్రజావాణి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని 26నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వినియోగించుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న స్వరూపారాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ప్ర భుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీ వో స్వరూపారాణి తెలిపారు. శనివారం బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) కళాశాలలో వివరాలు వెల్లడించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు తాత్కాలిక ప్రాతిపదికన అ భ్యర్థులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈనె ల 28న ఉదయం 9గంటలకు బెల్లంపల్లి సీవో ఈ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, తరగతి గది బోధన పరిశీలన(డెమో) ఉంటుందన్నారు.

ఖాళీ పోస్టుల వివరాలు
బాలుర గురుకులాల్లో జూనియర్ లెక్చరర్స్ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ ఒక్కో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీటీ విభాగంలో హిందీ-1, ఇంగ్లిష్-4, గణితం-2, ఫిజికల్ సైన్స్-1, బయోలాజికల్ సైన్స్-1, సోషల్-1 ఖాళీగా ఉన్నాయి. టీజీటీ విభాగంలో గణితం, హిందీ, బయోలాజికల్ సైన్స్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. బాలికల గురుకులాల్లో జూనియర్ లెక్చరర్స్ విభాగంలో ఇంగ్లిష్-3, గణితం-1, బోటనీ-1, జువాలజీ-2 , కెమిస్ట్రీ-1, ఎకనామిక్స్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీటీలో ఇంగ్లిష్-1, సోషల్-2, టీజీటీలో హిందీ-1 పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో విద్యార్హత జిరాక్స్ ప్రతులతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని ఆర్సీవో సూచించారు.

తగ్గేదేలే..!



ఈ నెల 12న తిర్యాణి మండలం దోర్లి ఓపెన్‌కాస్ట్ వద్ద పట్టుకున్న కలపతో అటవీ అధికారులు

- అటవీశాఖకు స్మగ్లర్ల సవాల్..!
- ఆసిఫాబాద్‌లో అటవీ విధ్వంసం
- 120 టేకు చెట్లు నరికేసిన వైనం
- కలపతో పట్టుబడిన వాహనం
- స్మగ్లర్లకు ఇంటిదొంగల అండ!
- పట్టుకునే పనిలో అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: అడవుల ఖిల్లాలో అటవీ విధ్వంసం మొదలైంది. విలువైన టేకును రక్షించాల్సిన కొందరు అటవీశాఖ అధికారులు స్మగ్లర్లతో చేతులు కలపడంతో వందలాది చెట్లు నేలకొరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఫలితంగా స్మగ్లర్లు కూడా ఇక తగ్గేదే లే.. అన్నట్లుగా టేకుచెట్లను నరికివేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పట్టుబడ్డ టేకు లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామ పరిసర అటవీ ప్రాంతం నుంచి తరలించినట్లు అటవీశాఖ అధికారుల దర్యాప్తులో తేలింది. అయితే పెద్ద సంఖ్యలో టేకుచెట్లను నరికినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పట్టుబడ్డ వాహనం ఆధారంగా స్మగ్లర్ వివరాల సేకరణలో అటవీ అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం. రెండు, మూడు రోజుల వ్యవధిలో టేకు స్మగ్లింగ్ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

నేలకొరిగిన 120 టేకు చెట్లు..
ఇటీవల ఆసిఫాబాద్ మండల పరిధిలోని మోవాడ్ గ్రామస్తులు అక్రమంగా టేకును తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అడ్డుకుని.. అటవీ అధికారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ శుక్రవారం లింగాపూర్ మండలంలోని ఎల్లాపటార్ గ్రామ పరిసర అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడి అటవీ ప్రాంతంలోని టేకుచెట్లను స్మగ్లర్లు నరికేసినట్లు తెలుస్తోంది. బొలెరో వాహనంలో పట్టుబడిన టేకు అక్కడి నుంచే తరలించారని అటవీ అధికారులు భావిస్తున్నారు. అటవీశాఖ అధికారుల దర్యాప్తులో తిర్యాణి-లింగాపూర్ నడుమ ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం నుంచి ఏకంగా 120కి పైగా టేకుచెట్లను స్మగ్లర్లు నరికినట్లు తేలింది. ఇంటిదొంగల సహకారం లేనిదే ఇంత పెద్ద ఎత్తున చెట్లు నరకడం సాధ్యం కాదని.. టేకు అక్రమ రవాణాకు అండదండలు అందించిన అటవీ సిబ్బంది ఎవరు? అనే కోణంలో దర్యాప్తు చేపట్టిన జిల్లా అటవీశాఖ అధికారి ఇంటిదొంగలపై చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే పట్టుబడిన కలప తమ రేంజి పరిధిలోకి రాదంటూ.. అటవీశాఖ అధికారులు కొందరు ఉన్నతాధికారి వద్ద మొరపెట్టుకున్నట్లు సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే ఒకప్పుడు ఆసిఫాబాద్ జిల్లాలో అడవులు ఉండేవి.. అని చెప్పుకోవాల్సిన దుస్థితి వస్తుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

ఇంటిదొంగల వేటలో జిల్లా అధికారి
రెండు నెలల క్రితం కెరమెరి మండలంలో కలప స్మగ్లింగ్ చేస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. తాజాగా మోవాడ గ్రామస్తులు టేకును అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని అటవీ అధికారులు అప్పగించారు. ఇలా తరచూ ఏదో ఒక మార్గంలో విలువైన కలప స్మగ్లింగ్ జరుగుతోంది. అయితే ఈ కలప ఎక్కడి నుంచి వస్తోంది? ఏ రేంజి పరిధిలోనిది? ఏ బీట్ పరిధిలోనిది? కలప తరలుతుంటే అక్కడి సిబ్బంది ఏం చేస్తున్నారు? స్మగ్లర్లకు సహకరిస్తున్నారా? పనితీరు ఎలాగుంది? అనే అంశాలపై జిల్లా అటవీ శాఖ అధికారి దృష్టిసారించారు. కెరమెరి ఘటనలో ముగ్గురు సిబ్బందిపై వేటు పడింది. ఇప్పుడు భారీ ఎత్తున టేకుచెట్ల నరికివేత ఘటన వెలుగులోకి రావడంతో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా స్మగ్లర్లకు సహకరించిన వారిపై కఠిన చర్యలకు వెనుకాడనని హెచ్చరించడంతో కలప స్మగ్లర్లకు సహకరిస్తున్న అటవీ సిబ్బందిలో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది. అడవి రక్షణ కోసమే ఉద్యోగులను నియమిస్తే వారి పట్టింపులేని తనంతో యథేచ్ఛగా స్మగ్లింగ్ జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్మగ్లింగ్ గుట్టు బయటపడిందిలా...
ఆసిఫాబాద్ మండలం గుండీగూడ తండాకు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా కలప స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అతడితో మరికొందరు కలిసి తిర్యాణి, లింగాపూర్, జైనూర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాల్లో విలువైన కలపను నరికి కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, నిజామాబాద్ పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల మోవ్వాడ గ్రామస్తులు పట్టుకున్న టేకు తిర్యాణి-లింగాపూర్ మధ్య ఉన్న దట్టమైన అటవీ ప్రాంతానికి చెందినది అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ టేకు చెట్ల వయస్సు 40-50 ఏళ్లు ఉంటుందని అంచనా. పవర్ సా మిషన్లతో దాదాపు 120కిపైగా విలువైన టేకుచెట్లను స్మగ్లర్లు నరికేసినట్లు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన టేకు విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని అటవీ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. గుండీగూడ తండాకు చెందిన స్మగ్లర్ కొద్దిరోజుల క్రితం మోవ్వాడ గ్రామస్తులను బెదిరించినట్లు తెలిసింది. కలప స్మగ్లింగ్‌కు అడ్డువస్తే చంపేస్తామని హెచ్చరించడంతో ఆ గ్రామస్తులంతా ఏకమై అతడికి చెందిన బొలెరో వాహనాన్ని అడ్డుకుని అటవీశాఖ అధికారులకు పట్టించారు. తీగ లాగితే డొంక కదిలినట్టుగా అటవీశాఖ ఉన్నతాధికారి విచారణలో టేకుచెట్ల నరికివేత గుట్టు బయటపడినట్లు తెలుస్తోంది. అయితే అటవీశాఖ అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

త్వరలో స్మగ్లర్ల వివరాలు వెల్లడిస్తాం
ఆసిఫాబాద్ లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామ పరిసర అటవీ ప్రాంతంలోని కొన్ని టేకు చెట్లను స్మగ్లర్లు నరికిన సమాచారంతో శుక్రవారం అక్కడికి వెళ్లి విచారించాం. మోవ్వాడ గ్రామంలో టేకుతో పట్టుబడిన బొలెరో వాహనం వివరాలు సేకరిస్తున్నాం. స్మగ్లర్లను గుర్తించే పనిలో ఉన్నాం. దర్యాప్తు జరుగుతోంది. మూడు, నాలుగు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.
– నీరజ్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి

'రైతుబంధు'వు..!

- రేపటి నుంచే పెట్టుబడి సాయం
- ఖాతాల్లో జమ చేయనున్న సర్కార్
- జిల్లాలో 1,24,194 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తంజేస్తున్న అన్నదాతలు



మండలాల వారీగా రైతులు, పెట్టుబడి సాయం

మండలం	రైతులు	సాయం (రూ.కోట్లలో..)
ఆసిఫాబాద్	11,983	19.63
రెబ్బెన	11,785	17.67
తిర్యాణి	7,166	12.28
వాంకిడి	9,337	17.92
కాగజ్‌నగర్	12,876	18.58
కౌటాల	7,296	10.73
సిర్పూర్(టి)	7,071	10.31
బెజ్జూర్	9,191	12.56
చింతలమానెపెల్లి	7,895	11.56
దహెగాం	12,091	17.91
పెంచికల్‌పేట్	5,694	7.55
జైనూర్	6,163	13.48
కెరమెరి	6,461	12.62
లింగాపూర్	4,511	9.57
సిర్పూర్(యు)	4,674	10.76

ఖరీఫ్ సాగు ప్రణాళిక ఇలా..

పంట రకం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	3,42,000
వరి	58,780
కంది	35,000
సోయాబీన్	9,657
పెసర	3,017
జొన్న	2,962
మొక్కజొన్న	855
మినుము	387
వేరుశనగ	180
ఇతర పంటలు	2,200
మొత్తం	4,55,038

ఆసిఫాబాద్/కౌటాల: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం అన్నదాతల్లో ఎంతో భరోసా నింపుతోంది. జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏటా యాసంగి, వానాకాలం పంటల సాగుకు ఎకరాకు రూ.5వేల చొప్పున ప్రభుత్వం రెండు పంటలకు రూ.10 అందజేస్తోంది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.2వేల ఆర్థికసాయం అందిస్తోంది. గతేడాది యాసంగి సాయం రైతులకు పూర్తి స్థాయిలో అందలేదు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమవడంతో రైతుబంధు కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ఈ నెల 26నుంచి పెట్టుబడి సాయం అన్నదాతల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండగా రైతులు సంబురపడుతున్నారు.

జిల్లాలో 4లక్షల ఎకరాలకు పైగా సాగు..
జిల్లాలోని 15 మండలాల్లో 1,24,194 మంది రైతులుండగా 4లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందుకోసం రూ.202.50కోట్ల బడ్జెట్ అవసరముంది. తొలుత 21,484 మంది రైతులకు రూ.6,96,18,962 అవసరమని ట్రెజరీకి ప్రతిపాదనలు పంపారు. గతేడాది యాసంగిలో జిల్లాలోని రైతులకు పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయం అందకపోవడంతో ఈ ఏడాది కూడా అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది యాసంగిలో జిల్లాలో 1,14,448 మంది రైతులకు గాను 1,13,477 మంది రైతుల ఖాతాల్లో రూ.189.45 కోట్లు జమ చేశారు. జిల్లాలో గత యాసంగిలో 1,14,448 మంది రైతులుండగా, ఈ ఏడాది వానాకాలంలో 1,24,194 రైతులను గుర్తించారు. దీంతో ఈ ఏడాది కొత్తగా 9,746 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రైతుబంధు సాయం జమ కానుంది.

సాగు పనుల్లో రైతులు
జిల్లాలో ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించి తొలకరి జల్లులు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో 70శాతం రైతులు పత్తి విత్తనాలు విత్తారు. తమ వద్ద అందుబాటులో ఉన్న పెట్టుబడితో విత్తనాలు కొనుగోలు చేసి, ఎరువులు ఇతర అవసరాలు తీర్చుకునేందుకు రైతుబంధు సాయం కోసం నిరీక్షిస్తున్నారు. సీజన్ ప్రారంభమవడంతో జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి. పొలంబాట పట్టిన రైతులు ఎరువులు, విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. ఎరువులు, విత్తనాల ధరలతో పాటు కౌలు ధరలూ పెరిగాయి. దీంతో రైతులకు సాగు భారంగా మారింది. కొంతమంది తమ వద్ద అందుబాటులో ఉన్న డబ్బులతో వ్యవసాయ పనులు ప్రారంభించగా, నిరుపేద రైతులకు సాగుకోసం ప్రభుత్వ ఆర్థికసాయం తప్పనిసరిగా మారింది.

కౌలు రైతుకు నిరాశ
రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పోడు సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వనుంది. పోడు పట్టాలు పొందిన రైతులకు రైతుబంధు అందించనున్నట్లు సమాచారం. కానీ.. కౌలురైతుకు నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని వందలాది ఎకరాలున్న రైతులకూ వర్తింపజేస్తుండడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఐదెకరాలున్న వారికే ఈ పథకాన్ని అమలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తంజేస్తున్నారు. సాధారణ పేద రైతులకు అందాల్సిన నిధులు వందలాది ఎకరాలున్న భూస్వాములు, ఉద్యోగులు, రాజకీయ నాయకులకూ అందజేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టాదారులకు రైతుబంధు నగదు అందించినా.. తమకు కౌలుధరలు తగ్గించడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. తమకూ రైతుబంధు వర్తింపజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇప్పటికే రైతుల గుర్తింపు
జిల్లాలో రైతుబంధు సాయం అందించేందుకు ఇప్పటికే అర్హులైన రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. వానాకాలానికి సంబంధించి రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

మాతాశిశుమరణాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో మాతాశిశుమరణాలపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో మాతాశిశుమరణాల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల గ్రామాలకు వానాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఎదురయ్యే క్రమంలో ఆయా గ్రామాల్లో ఉండే గర్భిణుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వానాకాలంలో రోడ్లు చెడిపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగే గ్రామాలకు సంబంధించి ప్రతీనెల మూడో శనివారం జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీపీలు హాజరవుతారని, గ్రామాల వివరాలు సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులకు ముందు జాగ్రత్తగా అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రామకృష్ణ, జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్‌సెల్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



తంబాకు నియంత్రణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లాలో సికిల్‌సెల్ నిర్మూలనకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్యశాఖ అధికారులతో సికిల్‌సెల్ నిర్మూలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని ఆశ్రమ గురుకుల, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో బాలికలకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలికల పేర్లు, ఆధార్ నంబర్లు, వివరాలు సేకరించి ఈ నెల 27నుంచి ప్రారంభమయ్యే సికిల్‌సెల్ నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 20 కమిటీలు, ఉపకేంద్రాల పరిధిలో 18 కమిటీలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 50 శాతం మహిళలతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచులు, ఎంపీపీలు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ పాఠశాలకు ఒకరోజు ముందుగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. వానాకాలం ప్రారంభమైనందున పాఠశాల ఆవరణ, పరిసరాల్లో మురుగునీరు నిలువకుండా గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం తంబాకు నియంత్రణ ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. డీఐఈవో శ్రీధర్ సుమన్, జిల్లా సంక్షేమాధికారి సావిత్రి, డీఎంహెచ్‌వో రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీబీజీకేఎస్ సిద్ధమే'

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల జాప్యానికి తాము ఏమాత్రం కారణం కాదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఎన్నికలను వాయిదా వేస్తూ ఆదేశాలు ఇచ్చిన కేసులో తమ ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు. తాము ఎన్నికలు వాయిదా వేయాలని ఎలాంటి కేసు వేయలేదని, కోర్టు ఆదేశాలిచ్చిన కేసులో ఎక్కడా తమ వాదనలు కూడా లేవని తెలిపారు. ఎన్నికలపై గతంలో ఏఐటీయూసీ వేసిన కేసు ఆధారంగా, కంపెనీ తాజాగా వేసిన కేసుతో 2023 ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాలను మాడిఫై చేస్తూ కోర్టు తాజాగా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించింది తమ సంఘమేనని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్మికులు టీబీజీకేఎస్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మొక్కలకు రక్షణేది?

- జోడేఘాట్‌లో పచ్చదనం కరువు
- మైదానంగా మారిన హరితవనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నీరు లేక నిర్జీవమైన మొక్కలు
- 29వేలు నాటగా మిగిలింది వెయ్యే..



మైదానంగా హరితవనం



మనిషి ఆకారంలో నాటిన మొక్కలు కనిపించకుండా పోయిన దృశ్యం

కెరమెరి(ఆసిఫాబాద్): హరితహారం సమయంలో హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత గమ్మునుండిపోతున్నారు. జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో నైజాం సర్కార్‌ను గడగడలాడించి చివరకు ప్రాణాలర్పించిన కొమురంభీం యుద్ధం చేసిన జోడేఘాట్ వద్ద 2016 అక్టోబర్‌లో అటవీశాఖ ఏర్పాటు చేసిన బృందావనం నేడు మైదానంగా మారింది. ఇక్కడ నాటిన 29,750 మొక్కలకు రక్షణ కరువైంది. ఇక్కడ సీతాఫల్, జామ, మామిడి, కానుగ, ఆపిల్ తదితర మొక్కలు నాటారు. మొక్కలు నాటించిన అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. దీంతో మొక్కలన్నీ ఎండి కనీసం వెయ్యి కూడా మిగల్లేదు. ఆ తర్వాతి సంవత్సరం నుంచి మొక్కలు నాటుతున్నా నీటి నిర్వహణ సరిగా లేక ఎండిపోతున్నాయి. ఓ వైపు హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం చెబుతుంటే.. మరో వైపు నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతోంది. హరితహారం కోసం రూ.కోట్లు వెచ్చించి అటవీ, ఉపాధి నర్సరీల్లో మొక్కలు పెంచుతుండగా వాటిని నాటిస్తున్న అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది.

అధికారుల పట్టింపులేకే..
సుగంధ ద్రవ్యాలు, ఆయుర్వేద మొక్కలు పెంచి ప్రజలకు ఆయుర్వేదంపై నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో జోడేఘాట్ సమీపంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటి బృందావనాన్ని ఏర్పాటు చేశారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో కొనసాగిన బృందావనం మొక్కలు, దాని సమీపంలోని మొక్కలకు కూడా నీళ్లు పోసేందుకు ఓ కూలీని నియమించారు. కానీ.. నీళ్లు లేక మొక్కలు ఎండిపోగా ఎవరూ పట్టించుకోవడంలేదు. కూలీకి వేతనం కూడా ఇవ్వకపోవడంతో అతడు పని మానేశాడు. 100 రకాల ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కలు నాటి బృందావనాన్ని ఏర్పాటు చేశారు. మనిషి కాళ్లు, చేతులు, తల ఆకృతిలో ఔషధ మొక్కలు నాటారు. ఒక్కో అవయవం వద్ద దానికి అవసరమయ్యే మొక్కలు నాటారు. మిగతా స్థలంలో సుగుంధ ద్రవ్యాలకు సంబంధించిన మొక్కలు నాటుతామన్న అధికారుల మాటలు నీటిమూటలయ్యాయి. ప్రస్తుతం ఆ ఆకృతి ఆనవాళ్లు కోల్పోయింది. దాని సమీపంలోనే నిర్మించిన లోటస్ పాండ్ నిరుపయోగమైంది. ప్రస్తుతం మురుగునీటితో దర్శనమిస్తోంది.

నీటి కొరత కారణంగానే..



జోడేఘాట్‌లో నీటి కొరత అధికంగా ఉండడంతో మొక్కలు చనిపోతున్నాయి. అందుకే ఈసారి కానుగ మొక్కలు నాటాలనే ఆలోచనలో ఉన్నాం. గ్రామస్తులు హరితవనంలో పశువులను మేపకుండా చూస్తే మొక్కలు బతికే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నీటి సౌకర్యం కల్పించాలి.
– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి



క్లుప్తంగా

ఇద్దరిపై కేసు

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన ఓరం రమేశ్, ఓరం వెంకటేశ్‌లపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన వేముల రాజేశ్ ఓరం రమేష్ వద్ద రూ.20 వేలు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించాడు. అయినప్పటికీ రమేశ్ ఇంకా రూ.5 వేలు రావాలని తన అన్న వెంకటేశ్‌తో కలిసి రాజేశ్ ఇంటిపైకి గొడవకు వెళ్లి ఇంటి తలుపులు పగులగొట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్లు దొంగిలించిన ఇద్దరు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

జన్నారం(ఖానాపూర్): వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను దొంగిలించిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. జన్నారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మే 31, జూన్ 1 తేదీల్లో జన్నారం మండలం ఇందన్‌పల్లిలో సత్యంరావు, రెంకల స్వామి, రెంకల కుమారస్వామి, రెంకల మల్లేశ్ విద్యుత్ మోటార్లతో పాటు దోభీఘాట్‌కు అమర్చిన మోటార్ సైతం దొంగిలించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగిలించిన మోటార్లను శనివారం ఆటో ట్రాలీలో జగిత్యాలకు తరలిస్తుండగా ఇందన్‌పల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్‌కు చెందిన గుడిపెల్లి సుధాకర్, భీంరెడ్డి చోరీకి పాల్పడినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో జన్నారం ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



పావని (ఫైల్)

భీమారం(చెన్నూర్): ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కొత్తగూడెం ఏరియాకు చెందిన పందుల పద్మ, నర్సయ్య దంపతుల కుమార్తె పావని (19) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నర్సయ్య మూడేళ్ల క్రితం మృతి చెందాడు. తరచూ తండ్రి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మనస్తాపానికి గురైంది. శనివారం అందరూ బయట కూర్చుని ఉండగానే ఒక్క సారిగా ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.



వేడుకగా గోరింటాకు చూపుతున్న మహిళలు, యువతులు

ఆషాఢమొచ్చె.. ఆనందాలు తెచ్చె..!

ఆషాఢమాసం ప్రారంభమైంది. ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఈ మాసం సొంతం. శూన్య మాసమని వ్యవహరించినప్పటికీ ఎంతో నిండుదనాన్ని కలిగి ఉంటుంది. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండుగలు ప్రారంభమవుతాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బోనాల పండుగను ఈ మాసంలోనే నిర్వహిస్తారు. ఈ యేడు జూన్ 19న ప్రారంభమైన ఆషాఢం జూలై 17తో ముగియనుంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆషాఢం గురించి కథనం..

– ఆదిలాబాద్/నిర్మల్‌ఖిల్లా

- పండుగల ఆరంభం ఈ మాసంలోనే..
- పర్వదినాలకు ప్రతీతి
- శుభకార్యాలకు మాత్రమే బ్రేక్

శూన్యమాసం...

తెలుగు సంవత్సరాల్లో నాలుగో నెల ఆషాఢం. పూర్వాషాఢ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెలయే ఆషాఢ మాసం. ఈ మాసంలోనే వర్షఋతువు ప్రారంభమవుతుంది. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెలగా తెలియజేస్తారు. ఉత్తరాయన పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయనం ప్రారంభమైన మాసం కనుక ఆషాఢ మాసం శూన్యమాసం. ఈమాసంలో గృహప్రవేశం వివాహం వంటి శుభకార్యాలు చేయకూడదని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. అయితే దేవతారాధనలకు, శక్తి ఆరాధనలకు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.

పర్వదినాలు ప్రారంభం

ఆషాఢం అనే పదం 'ఆది' అనే సంస్కృత పదం నుంచి ఉద్భవించింది. ఆది అనగా శక్తి అనే అర్థాన్ని తెలియజేస్తుంది. కావున ఆషాఢ మాసంలో దేవతలను పూజించడం అనేది పరమ పవిత్ర కార్యమని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ఈ మాసంలో పవిత్రమైన పూజలు, వ్రతాలు, రథయాత్రలు, పల్లకీసేవలు అధికంగా జరుగుతుంటాయి. దేశంలోని ప్రముఖమైన పూరి జగన్నాథుని రథయాత్ర సైతం ఆషాఢ మాసంలోనే జరగడం విశేషం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ ఉంటాయి. పండితులు పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. తొలి ఏకాదశి నుంచి పండుగలు ప్రారంభమవుతాయి. ఆషాఢశుద్ధ ఏకాదశి రోజున మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఆషాఢ శుద్ధపౌర్ణమి రోజున గురుపౌర్ణమిగా పరిగణిస్తారు. ఈ మాసంలో స్కంద పంచమి, 'దక్షిణాయన పుణ్యకాలం' కూడా ప్రారంభమవుతుంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు ఆషాఢంలోనే అంగరంగ వైభవంగా ఆరంభమవుతాయి. వర్షాకాలం రాకతో ఈ ఉత్సవాలు ప్రారంభం కావడం కొంత శాస్త్రీయతను సైతం కలిగి ఉంటాయి.

అత్తారింటి నుంచి పుట్టింటికి..

కొత్తగా పెళ్లయిన అమ్మాయిలు ఆషాఢమాసంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళ్తారు. ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదని సంప్రదాయబద్ధంగా వస్తోంది. కొత్తగా పెళ్లై అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రులపై బెంగతో ఉంటారు. వీరు ఆషాఢమాసంలో పుట్టింటికి వెళ్లి తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారని ప్రతీతి.

గోరింట మెరుపులు

గోరింటాకును అతివలు అమితంగా ఇష్టపడతారు. వాటిని తమ అరచేతుల్లో వేసుకుని ఎర్రగా పండితే మురిసిపోతారు. ఏ పర్వదినాలకైనా శుభకార్యానికైనా గోరింటాకు ఉండాల్సిందే. ముఖ్యంగా ఆషాఢ మాసంలో గోరింటాకు ధరించడం అనేది ఆనవాయితీగా వస్తోంది. గ్రీష్మ రుతువు అనంతరం వర్ష రుతువులో ఆషాఢ మాసం వస్తుంది. ఈ సమయంలో గ్రీష్మ రుతువులో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడిపోతుంది. ఈ కారణంగా గోరింటను అరచేతుల్లో ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. చర్మ సమస్యలు కూడా దరిచేరవు. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండడంతో పాటు రోగనిరోధక శక్తిని సైతం పెంచుతుంది. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం వలన సౌభాగ్యాన్ని పొందిన వారవుతారని జ్యోతిష్యులు తెలియజేస్తున్నారు.

అమ్మవార్లకు బోనాలు



బోనమెత్తిన మహిళలు, యువతులు

తెలంగాణలో బోనాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. గ్రామం పట్టణం అనే తేడా లేకుండా ఎవరికి వారు ఎంతో ప్రత్యేకతలతో ఆషాఢ మాసంలో బోనాలు సమర్పిస్తారు. ముందుగా హైదరాబాద్ నగరంలో ప్రారంభమైన బోనాల పండుగ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటారు. పూర్వకాలం నుంచి గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవార్లకు బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. బోనాల పండుగ నిర్వహణ వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉంది. ఆషాఢమాసంలో వర్షాలు ప్రారంభమై కొత్త నీరు వచ్చి చేరడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే బోనాల ఉత్సవాలు జరుగుతుంటాయి. బోనాల పండుగ నిర్వహణలో భాగంగా బోనం సమర్పించే సమయంలో ఘటాలకు వే పకొమ్మలు కట్టడం, ఇంటిని వేపకొమ్మలతో అలంకరించడం చేస్తుంటారు. వేప గొప్ప క్రిమిసంహారకంగా వ్యవహరిస్తుంది. ఆడపడుచులు తమ ఘటాలకు, పాదాలకు సైతం పసుపును రాసుకుంటారు. ఇది మంచి యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది.

మహిళలకు ప్రత్యేకం...



గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు అమితమైన ఇష్టం. మా కాలనీలో మహిళలందరం కలిసి ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటాం. దీనివల్ల చర్మసౌందర్యంతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. మా పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అందరం కలిసి ఆనందంగా వేడుకల్లో పాల్గొంటాం. అమ్మవారికి పూజలు కూడా చేస్తాం. – కొప్పుల భారతి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నిర్మల్

శాస్త్రీయంగా కూడా ప్రయోజనాలు



గోరింటాకును శాస్త్రీయ పరిభాషలో 'లావుసీనియా ఇనెర్మిస్'గా పిలుస్తారు. ఇది 'లైత్రేసియా' కుటుంబానికి చెందిన ఔషధ గుణాలున్న మొక్క. దీని లేత ఆకులను మెత్తగా నూరి మహిళలు చేతులు, అరచేతులు, పాదాలకు పెట్టుకుంటారు. దీనివల్ల చర్మ సౌందర్యంతో పాటు ఎదుటివారిని ఆకర్షించే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని చూర్ణంగా చేసి పెట్టుకోవడం వల్ల ఆకులోని వర్ణద్రవ్యం లోగల 'లావుసీన్' అనే రసాయనం ఆరిన తర్వాత ఎరుపు రంగును ఇస్తుంది. ఇందులో చర్మ రోగాలను నివారించే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది. – డాక్టర్ వెల్మల మధు, వృక్ష శాస్త్ర నిపుణులు, నిర్మల్

చర్మ సౌందర్యం ఇస్తుంది



గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మానికి అందాన్నిస్తుంది. మేము మా శ్రీరామ మహిళా సంఘం సభ్యులమంతా కలిసి ఏటా ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలు ఉత్సాహంగా జరుపుకుంటాం. లేలేత గోరింటాకు తెంపుకుని వచ్చి మెత్తగా నూరి చేతులపై విభిన్న రకాల డిజైన్లు వేసుకుంటాం. – గన్నారపు అన్నపూర్ణ, నిర్మల్

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

పాతమంచిర్యాల: జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులు, లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో గణితం, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, సోషల్ సబ్జెక్టులు బోధించడానికి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తిచేసి ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులకోసం పీజీ, బీఈ డీ చేసి ఉండాలన్నారు. డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగనుందని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28లోగా బయోడేటాను ఎంజేపీలో అందజేయాలని సూచించారు. ఈ నెల 30న గుడిపేటలోని గురుకులంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7993456620 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఏర్పాటయ్యే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశంకోసం ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంజేపీ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో జరిమానా



జరిమానా పత్రం ఇస్తున్న తహశీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి శనివారం తహశీల్దార్ రాజలింగు జరిమానా విధించారు. మంచిర్యాలకు చెందిన ఉప్పరి నాగార్జునను గతంలో సబ్బెపల్లి గ్రామ శివారులోని భూ వివాదంలో తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నాగార్జున గత బైండోవర్‌ను ఉల్లంఘించి తాజాగా భూ వివాదంలో జోక్యం చేసుకున్నాడు. ఈ మేరకు హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ నాగార్జునను అదుపులోకి తీసుకుని తహశీల్దార్ రాజలింగు ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బైండోవర్ నిబంధనలకు ఉల్లంఘించినందుకు గానూ రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు చేసిన లేఖను అందజేశారు.

సమావేశాలు ఎందుకు నిర్వహించడంలేదు?

- మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ ఝాన్సీరాణి



మాట్లాడుతున్న ఆర్జేడీ ఝాన్సీరాణి

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా నిర్వహించాల్సిన అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ (ఏఎల్ఎంసి)ని ఎందుకు నిర్వహించడం లేదని మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ ఆర్జేడీ బి.ఝాన్సీరాణి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్, కౌన్సిలర్ కమిటీ అధ్యక్షులుగా ఏడుగురితో కలిపి కమిటీని ఏర్పాటు చేసి నెలలో ఒకసారి సమావేశం అయ్యేలా చూడాలన్నారు. కమిటీలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలను రిజిష్టరులో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రెండు, మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించుకోవాలన్నారు. పిల్లల గ్రోత్ మానిటరింగ్‌ను చేపట్టి పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, సీడీపీవోలు హేమసత్య, విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్‌లు రఘువీర్, రాజేందర్ పాల్గొన్నారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజాసేవ

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



అంబలి పంపిణీ చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకుండా, తన తండ్రి పేరిట కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో 56 రోజులుగా ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న అంబలి పంపిణీ కేంద్రం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 30 నుంచి ప్రజలకు ప్రతీరోజు మధ్యాహ్నం ఐబీ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, సీసీసీ, శ్రీరాంపూర్, లక్సెట్టిపేటలో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అంబలితో పాటు, చల్లని తాగునీరు, ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ప్రజలు తనను గెలిపిస్తారని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న సీటీసీ సంజయ్‌కుమార్ సూర్

జైపూర్: ఎస్టీపీపీలో ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న అధికారులను శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం(వోసీపీఎస్) వైజీకె.మూర్తి, ఓసీ-3, ఆర్జీ-2 ప్రాజెక్టు ఇంజనీర్ దుర్గాప్రసాద్ ఘనంగా సన్మానించారు. అధికారులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం సూర్యనారాయణరాజు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు కమలాకర్ భూషణ్, శ్రీనివాస్, డీజీఎం స్టోర్స్ ఎంఎన్‌వీ రమణ, రాయమల్లు, డీజీఎం పర్సనల్ కేసా నారాయణరావు, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 20 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న కేయూ డిగ్రీ పరీక్షల్లో శనివారం 20 మంది డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 9 మంది, పూలాజీబాబా డిగ్రీ కళాశాలలో నలుగురు, అజ్మీరా రేఖనాయక్ కళాశాలలో ఒకరు, మంచిర్యాల విద్యానికేతన్ డిగ్రీ కళాశాలో ఇద్దరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు మహిళలు కోర్టుకు తరలింపు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బెల్టుషాపుల్లో చొరబడి బాటిళ్లను ధ్వంసం చేయడమే కాకుండా నిర్వాహకులను దుర్భాషలాడిన 11 మందిపై శుక్రవారం ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. శనివారం రామిల్ల రాధిక, బత్తుల సరితను కోర్టుకు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పిడుగుపాటుకు యువరైతు మృతి



బిక్కు(ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువ రైతు ధాత్రే బిక్కు(35) శనివారం పిడుగుపాటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బిక్కు తన పంటచేనులో పత్తి విత్తనాలు విత్తేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో బిక్కు సమీపంలోని వేపచెట్టు కింద నిలబడి ఉండడంతో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మల్లన్నస్వామికి గంగస్నానం



జైపూర్: వేలాల మల్లికార్జునస్వామికి శనివారం గంగస్నానం చేయించారు. ఏటా తొలి ఏకాదశిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఇక్కడ వేడుకలు నిర్వహిస్తారు. తొలిరోజు మల్లన్నస్వామి, కేతమ్మ భ్రమరాంభికలను ఒగ్గు పూజారులు గోదావరికి తీసుకెళ్లారు. ఆదివారం పట్నాలు వేసి స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు.

బహుదూరపు బాటసారులు



గొర్రెల మంద వద్ద గుజరాత్ వాసులు

నెన్నెల(బెల్లంపల్లి): గొర్రెల పెంపకమే వారి జీవనాధారం. వాటి సంరక్షణకు సుదీర్ఘ ప్రయాణమే చేస్తున్నారు. ఇంటిని, కుటుంబ సభ్యులను వదిలి వేల కిలోమీటర్ల దూరం దేశాటన చేస్తున్నారు. ఎక్కడ గ్రాసం ఉంటే అక్కడికి గొర్రెలను తోలుకెళ్తున్నారు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందిన 15 మంది గొర్రెల కాపరులు స్థానికంగా గ్రాసం లేకపోవడంతో నెన్నెలకు గొర్రెలను తొలు కొచ్చారు. పొలాల్లో గొర్రెలను మేపుతూ రాత్రివేళ స్థానిక రైతుల పంటచేలల్లో మందలను నిలు పుతూ అందుకు ప్రతిఫలంగా నగదు, బియ్యం తీసుకుంటున్నారు. వంటపాత్రలు, పిండి సామగ్రి గుడారాలకు వాడే కవర్లు, చద్దర్లు, బట్టలను మోసేందుకు ఒంటెలను ఉపయోగిస్తామని నాగ్‌జీబా, మెగాలకాలు వివరించారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు మాత్రమే గుజరాత్ వెళ్తామన్నారు.



ఒంటెలను మేపేందుకు వెళ్తున్న గుజరాత్ వాసి

మహిళను దూషించిన హోంగార్డుపై కేసు

బెల్లంపల్లి: పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన ఓ మహిళను దూషించిన హోంగార్డు సురేష్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై విఠల్ తెలిపారు. కాలనీకి చెందిన గోసిక సుధ ఇంటిని ఆనుకుని సురేష్ దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తుండడంతో ఆమె అభ్యంతరం తెలిపింది. ప్రహరీ తొలగించాలనడంతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హోంగార్డు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీగా వెంకటస్వామి

మందమర్రిరూరల్(చెన్నూర్): ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీగా మందమర్రికి చెందిన సీనియర్ నాయకుడు పానుగంటి వెంకటస్వామిని నియమిస్తూ శనివారం యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ జనక్‌ప్రసాద్, కాంపెల్లి, సమ్మయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.